జర్నలిస్టుల పిల్లలకు ఫీజు రాయితీ కల్పించండి

హైదరాబాద్, జూన్ 27 (నమస్తే తెలంగాణ) : రాష్ట్రంలోని ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల్లో జర్నలిస్టుల పిల్లలకు 50 శాతం ఫీజు రాయితీ కల్పించాలని, గురుకులాల్లో స్పెషల్ కోటాలో సీట్లు ఇప్పించాలని కోరుతూ టీడబ్ల్యూజేఎఫ్ ప్రతినిధులు గురువారం సచివాలయంలో విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశంను కలిసి వినతిపత్రం అందజేశారు. తమ వినతులపై బుర్రా సానుకూలంగా స్పందించినట్టు వెల్లడించారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎం సోమయ్య, ప్రధాన కార్యదర్శి బీ బసవపున్నయ్య, ఉపాధ్యక్షుడు పిల్లి రాంచందర్, బీ రాజశేఖర్, కార్యదర్శులు బీ జగదీశ్వర్, గండ్ర నవీన్, రాష్ట్ర కమిటీ సభ్యులు అరుణ్‌కుమార్, ఎం రమేశ్, రామకృష్ణ తదితరులు ఉన్నారు.

కాళేశ్వరంపై 58 అఫిడవిట్లు

హైదరాబాద్, జూన్ 27 (నమస్తే తెలంగాణ): కాళేశ్వరం ప్రాజెక్టుపై ఏర్పాటైన విచారణ కమిషన్ ఎదుట విచారణకు హాజరైన ఇంజినీర్లు, నిర్మాణ ఏజెన్సీలు, ప్రజాసంఘాలు, రైతులు తాజాగా అఫిడవిట్లను దాఖలు చేశారు. ఇప్పటి వరకు 58 అఫిడవిట్లు దాఖలయ్యాయని అధికార వర్గాలు వెల్లడించాయి. అఫిడవిట్ల దాఖలుకు కమిషన్ విధించిన గడువు నేటితో ముగియనున్నది. మరిన్ని అఫిడవిట్లు దాఖలయ్యే అవకాశమున్నది. అఫిడవిట్లన్నింటినీ పరిశీలించి, తదుపరి విచారణను కొనసాగిం చేందుకు కమిషన్ చైర్మన్ పీసీ ఘోష్ జూలై 5న రాష్ట్రానికి రానున్నారని సమాచారం.

కాజీపేట్ బైపాస్ రైల్వే లైన్ పనుల తనిఖీ

హైదరాబాద్, జూన్ 27(నమస్తే తెలంగాణ): కాజీపేట బైపాస్ రైల్వే లైన్ నిర్మాణ పనులపై దక్షిణమధ్య రైల్వే జనరల్ మేనేజర్ దృష్టి సారించారు. ఈ మేరకు పురోగతిలో ఉన్న పనులను గురువారం జోనల్ రైల్వే జీఎం అరుణ్ కుమార్ జైన్ తనిఖీ చేశారు. ప్రణాళికల ప్రకారమే పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. కాజీపేట బైపాస్ లైన్ 21.47 కిలోమీటర్ల వరకు నిర్మిస్తున్నట్టు చెప్పారు. ఈ ప్రాజెక్టు రూ.125 కోట్లు అంచనా వ్యయంతో ప్రారంభించినట్టు తెలిపారు. కాజీపేట, వరంగల్ స్టేషన్ల పునరాభివృద్ధి పనులను కూడా ఆయన గురువారం పరిశీలించారు.

కాంగ్రెస్ పార్టీ స్థలం అక్రమంగా రిజిస్ట్రేషన్

- నకిలీ పత్రాలతో ఖరీదైన స్థలం హాంఫట్
- నిజామాబాద్‌లో భూబాగోతం

కాంగ్రెస్ పార్టీకి చెందిన స్థలంలో అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసుకున్న మడిగె ఇదే..

మాబాద్, జూన్ 27 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): అధికార పార్టీ ఆస్తులకే రక్షణ లేకుండా పోయింది. కాంగ్రెస్‌కు చెందిన మడిగె ప్రైవేట్ వ్యక్తి పేరిట అక్రమంగా రిజిస్ట్రేషన్ అయిపోయింది. రిజిస్ట్రేషన్ శాఖలో అవినీతి, అక్రమాలకు నిలువెత్తు నిదర్శనంగా మారిన ఈ ఉదంతం నిజామాబాద్ జిల్లా కేంద్రంలో వెలుగుచూసింది. ఈ వ్యవహారం ఇటు పాలక పార్టీకి, అటు రిజిస్ట్రేషన్ శాఖకు మచ్చగా మారింది. ఒక ప్రబుద్ధుడు నకిలీ పత్రాలతో సబ్ రిజిస్ట్రార్ ఆఫీసులో స్లాట్ బుక్ చేసుకుని కాంగ్రెస్ పార్టీకి చెందిన మడిగెను తన పేరిట మార్చుకున్న ఉదంతం బయటకు పొక్కకుండా స్థానిక కాంగ్రెస్ నేతలు పోలీస్ కమిషనర్‌కు, జిల్లా రిజిస్ట్రార్‌కు ఫిర్యాదు చేయగా అంతర్గతంగా విచారణ కొనసాగుతున్నది. రూ.అర కోటికిపైగా విలువ చేసే ఈ మడిగెను తిరిగి దక్కించుకుని పరువు నిలబెట్టుకునేందుకు కాంగ్రెస్ ముఖ్యులంతా ఇదే పని మీద ఉన్నారు.

అక్రమం జరిగిందిలా..

చాలా ఏండ్లుగా నిజామాబాద్ నగరంలోని శంభుని గుడి వెనుకాల కాంగ్రెస్ పార్టీ పట్టణ శాఖ కార్యకలాపాల కోసం 75 గజాల విలువైన స్థలం ఉన్నది. ఇక్కడ ప్రైవేటు వ్యక్తులు దుకాణాలు పెట్టుకుని వ్యాపారాలు చేసుకుంటూ, కాంగ్రెస్ పార్టీకి కిరాయి చెల్లిస్తున్నారు. అధికార పార్టీకి సంబంధించిన ముఖ్యమైన కార్యకలాపాలన్నీ రైల్వేస్టేషన్ సమీపంలోని డీసీసీ ఆఫీసులోనే జరుగుతుండటంతో నాయకులు ఈ స్థలాన్ని పట్టించుకోవడం మానేశారు. దీంతో అక్రమార్కులు ఎలాగైనా ఈ స్థలాన్ని కొట్టేయాలని స్కెచ్ వేశారు. నకిలీ డాక్యుమెంట్లను సృష్టించారు. మహ్మద్ యూసుఫ్ అనే వ్యక్తి మహ్మద్ మాజిద్‌కు అమ్ముతున్నట్టుగా 2023 సెప్టెంబర్ 11న ఒప్పందం (అగ్రిమెంట్ ఆఫ్ సేల్) చేసుకున్నారు. అయితే, ఒప్పందంలో కీలకంగా ఉన్న యూసుఫ్ మరణించాడు. ఏం జరిగిందో ఏమో కానీ పాషా, రిజ్వానాబేగం అనే మహిళ మహ్మద్ మాజిద్‌కు 43.65 గజాల స్థలాన్ని అమ్మినట్టు 2024 మే 6న రిజిస్ట్రేషన్ చేసి ఇచ్చారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాతే ఆ రిజిస్ట్రేషన్ జరగడం విశేషం. కాంగ్రెస్ పార్టీ పేరిట ఉన్న ఈ స్థలానికి యూసుఫ్ ఎలా వారసుడిగా మారాడు? అతను చనిపోవడంతో రంగంలోకి మరికొంతమంది వ్యక్తులు ఎలా వచ్చారు? రికార్డులు సరి చూసుకోకుండానే సబ్ రిజిస్ట్రార్ స్థలాన్ని రిజిస్ట్రేషన్ ఎలా చేశారు? అన్నది మిలియన్ డాలర్ల ప్రశ్నగా మారింది. వాస్తవానికి 2002 నుంచే 8-4-359/1 ఇంటి నెంబర్‌తో గల స్థలం కాంగ్రెస్ పార్టీ పేరిట ఉన్నది. అధికార పార్టీ ఆస్తులకే రక్షణ లేకపోవడం, అక్రమంగా రిజిస్ట్రేషన్ జరగడం కాంగ్రెస్ నేతలను కలవరపాటుకు గురి చేసింది.

కంగుతిన్న కాంగ్రెస్ నేతలు

పార్టీ స్థలం తాము అధికారంలో ఉన్నప్పుడే యథేచ్ఛగా అక్రమంగా రిజిస్ట్రేషన్ కావడంతో కాంగ్రెస్ నేతలు కంగు తిన్నారు. వెంటనే పోలీస్ కమిషనర్ కల్మేశ్వర్ సింగెనవార్, జిల్లా రిజిస్ట్రార్ ప్రసూనకు ఫిర్యాదు చేశారు. పోలీసులు లోతుగా దర్యాప్తు చేస్తే ఈ తతంగంలో దాగి ఉన్న వ్యక్తుల పేర్లు బయటకొచ్చే అవకాశం ఉన్నది. కాంగ్రెస్ పార్టీ నుంచి ఫిర్యాదు రావడంతో ఉన్నతాధికారులు సబ్ రిజిస్ట్రార్ బాదర్‌కు మెమో జారీ చేశారు.

> **విచారణ చేస్తున్నాం**
>
> నిజామాబాద్‌లోని కాంగ్రెస్ పార్టీకి చెందిన స్థలం వేరే వ్యక్తుల పేరిట రిజిస్ట్రేషన్ జరిగిన వ్యవహారం మా దృష్టికొచ్చింది. ఈ వ్యవహారంపై ఫిర్యాదు కూడా అందింది. ఇప్పటికే సబ్ రిజిస్ట్రార్‌కు మెమో జారీ చేశాం. విచారణ చేసి వాస్తవాలను వెలికి తీసిన తర్వాత తప్పు చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం.
>
> - ప్రసూన, నిజామాబాద్ జిల్లా రిజిస్ట్రార్

వరాహస్వామి విగ్రహం లభ్యం

హైదరాబాద్, జూన్ 27(నమస్తే తెలంగాణ): కొత్త తెలంగాణ చరిత్ర బృందం సభ్యులు కరీంనగర్ జిల్లా గంగాధర మండలం కోట్లనర్సింహులపల్లెలో మూడు అంగుళాల వరాహమూర్తి విగ్రహాన్ని గుర్తించారు. ఈ విగ్రహం నాలుగో శతాబ్దానికి చెందినదని చరిత్రకారుడు శివనాగిరెడ్డి పేర్కొన్నారు. ఇక్కడ గతంలో శాతవాహనకాలం నాటి కుండపెంకులు, కొత్త రాతియుగంనాటి రాతిగొడ్డలి, మధ్యయుగంనాటి రాతి పరికరాలు లభించినట్లు గుర్తు చేశారు.

ఏసీ బ్యాచ్ వర్సెస్ వీసీ బ్యాచ్

మొదటిపేజీ తరువాయి...

వరంగల్ పశ్చిమ, వర్ధన్నపేట, పాలకుర్తి ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్‌రెడ్డి, కేఆర్ నాగరాజు, మామిడాల యశస్విని ఉన్నట్టు సమాచారం. ముఖ్యమంత్రి శుక్రవారం వరంగల్, హనుమకొండ జిల్లాల పర్యటనకు వస్తున్నారు. సీఎం ప్రోగ్రాం ఏర్పాట్లపై మంత్రి సురేఖ ఆధ్వర్యంలో హనుమకొండ కలెక్టరేట్ కార్యాలయంలో గురువారం సమీక్ష జరిగింది. మరో మంత్రి సీతక్క, ఎమ్మెల్యేలు కడియం , రేవూరి, రాజేందర్‌రెడ్డి, నాగరాజుతోపాటు రెండు జిల్లాల ఉన్నతాధికారులు పాల్గొన్నారు. సమావేశం నుంచి సీతక్క మధ్యలోనే వెళ్లిపోయారు. ఆ తర్వాత ఎమ్మెల్యేలు శ్రీహరి, ప్రకాశ్‌రెడ్డి బయటకు వచ్చారు. మంత్రి సురేఖ ఆహ్వానించినా ఆగకుండా సీతక్క, ఎమ్మెల్యేలు కడియం, రేవూరి ప్రకాశ్‌రెడ్డి వెళ్లిపోవడం చర్చనీయాంశమైంది.

లోక్‌సభ ఎన్నికల అనంతరం మరింతగా..

రాష్ట్ర ప్రభుత్వంలో వరంగల్ ఉమ్మడి జిల్లా నుంచి కొండా సురేఖ, సీతక్కలకు మంత్రి పదవులు దక్కిన సంగతి తెలిసిందే. ఆ వెంటనే ఇద్దరు మంత్రుల మధ్య ఆధిపత్య పోరు మొదలైంది. మేడారం జాతర, లోక్‌సభ ఎన్నికల ఇన్‌చార్జి, నామినేటెడ్ పోస్టుల కేటాయింపు విషయాల్లో మంత్రుల మధ్య విభేదాలు పొడసూపినట్టు కాంగ్రెస్ నాయకులు పేర్కొన్నారు. సీతక్క వరంగల్, హనుమకొండ జిల్లాల్లో జరిగే ఎలాంటి కార్యక్రమాలకు హాజరు కావడంలేదు. మేడారం జాతర ఏర్పాట్లు పూర్తిగా సీతక్క ఆధ్వర్యంలోనే జరగడంతో దేవాదాయ శాఖ మంత్రి సురేఖ అసంతృప్తితో ఒక్కరోజే వెళ్లి వచ్చారు. ఆ తర్వాత లోక్‌సభ ఎన్నికల ఇన్‌చార్జి బాధ్యతలను కాంగ్రెస్ అధిష్ఠానం మంత్రి సురేఖకు కాకుండా రేవూరి ప్రకాశ్‌రెడ్డికి అప్పగిచ్చింది. వరంగల్‌లోని ధార్మిక భవన్ కేటాయింపుపైనా భేదాభిప్రాయాలు వచ్చినట్టు చెప్తున్నారు. పరకాల నియోజకవర్గంలో కాంగ్రెస్ శ్రేణులకు ప్రాధాన్య విషయమై ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డికి, మంత్రి సురేఖకు మధ్య ఫోన్‌లో జరిగిన వాగ్వాదం సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. అప్పటి నుంచి మంత్రి సురేఖకు, ఎమ్మెల్యే రేవూరికి మధ్య విభేదాలు భగ్గుమన్నట్టు కాంగ్రెస్ శ్రేణులు పేర్కొన్నాయి. ఉమ్మడి జిల్లాలోని కాంగ్రెస్ కీలక ప్రజాప్రతినిధులు ఎవరికి వారుగా గ్రూపులు కట్టి ఆధిపత్య పోరు చెలాయిస్తున్నట్టు చెప్పుకుంటున్నారు.

డాక్టర్ కే ఎస్ రావుకు సృజన్‌శిఖర్ పురస్కారం

హైదరాబాద్, జూన్ 27(నమస్తే తెలంగాణ): కేంద్ర సాహిత్య అకాడమీ కార్యదర్శి డాక్టర్ కృత్తివెంటి శ్రీనివాసరావుకు సృజన్‌శిఖర్ పురస్కారం లభించింది. వారణాసికి చెందిన ప్రముఖ సాహిత్య సంస్థ నాందీ సేవా న్యాస్ సమితి యేటా ప్రముఖ సాహితీవేత్తలను ఈ పురస్కారంతో సన్మానిస్తున్నది. భారతీయ భాషాసాహిత్యాల అభివృద్ధికి చేస్తున్న కృషి, జాతీయస్థాయిలో నిరంతర సాహితీసేవకు గుర్తింపుగా డాక్టర్ కే.ఎస్. రావుకు ఈ పురస్కారం ప్రదానం చేస్తున్నట్టు నాందీ సేవా న్యాస్ సమితి సన్మాన పత్రంలో పేర్కొంది. వారణాసిలో బుధవారం జరిగిన సుప్రసిద్ధ హిందీ సాహితీవేత్త రాజేంద్రప్రసాద్ పాండే స్మారక సాహిత్య కార్యక్రమంలో డాక్టర్. కేఎస్ రావుకు పురస్కారంతోపాటు రూ. లక్ష నగదు బహుమతిని అందజేశారు. ప్రముఖ సాహితీవేత్తలు ప్రొఫెసర్ రాధా వల్లభ్ త్రిపాఠి, ప్రొఫెసర్ ప్రభాకర్ సింహ్ పాండే, డాక్టర్ శశికళా పాండే పాల్గొన్నారు.

త్వరలో క్యాబినెట్ విస్తరణ!

- జూలై మొదటివారంలోనే ముహూర్తం
- పీసీసీ చీఫ్ ఎంపికపైనా కసరత్తు
- సీఎం, డిప్యూటీ సీఎం, మంత్రులతో ఢిల్లీ పెద్దల వరుస సమావేశాలు

హైదరాబాద్, జూన్ 27(నమస్తే తెలంగాణ): రాష్ట్ర మంత్రివర్గాన్ని విస్తరించే దిశగా కాంగ్రెస్ అధిష్ఠానం కసరత్తు చేస్తున్నది. క్యాబినెట్‌ను జూలై మొదటివారంలో విస్తరించే అవకాశం ఉన్నట్టు సమాచారం. టీపీసీసీకి కొత్త అధ్యక్షుడి నియామకంపైనా కాంగ్రెస్ అధిష్ఠానం దృష్టి సారించింది. క్యాబినెట్ విస్తరణ, పీసీసీ చీఫ్ ఎంపికపై రాష్ట్ర నేతలతో ఢిల్లీలో కాంగ్రెస్ పెద్దలు జోరుగా చర్చలు జరుపుతున్నారు. సీఎం రేవంత్‌రెడ్డి నాలుగు రోజులుగా ఢిల్లీలోనే మకాం వేయగా, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కను అధిష్ఠానం మళ్లీ ఢిల్లీకి పిలిపించుకున్నది. గురువారం పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీతో సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్ కుమార్‌రెడ్డి, శ్రీధర్‌బాబు తదితరులు భేటీ అయ్యారు. ఆ తర్వాత కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి వేణుగోపాల్‌తో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా మంత్రివర్గ విస్తరణ, కొత్త అధ్యక్షుడి ఎంపికతోపాటు ఇతర పార్టీ ఎమ్మెల్యేల చేరికపై కూడా ప్రధానంగా చర్చించినట్టు తెలిసింది. జూలై మొదటి వారంలో మంత్రివర్గాన్ని విస్తరించాలనే నిర్ణయానికి వచ్చినట్టు తెలిసింది. పార్టీలో కొత్తగా చేరినవారిలో ఎవరికి మంత్రి పదవి ఇవ్వాలి? పాతవారిలో ఎవరికి ఇవ్వాలనే అంశంపై చర్చించినట్టు తెలిసింది. ఇందుకు సంబంధించి సీఎం, డిప్యూటీ సీఎం, మంత్రుల అభిప్రాయాలను దీపాదాస్ మున్షీ తీసుకున్నట్టు సమాచారం. స్థానికత, సామాజికవర్గాల కోణంలో లెక్కలు వేస్తున్నట్టు సమాచారం. పీసీసీ అధ్యక్షుడిగా రేవంత్‌రెడ్డి పదవీకాలం జూలై 7తో ముగియనున్నది. ఈ నేపథ్యంలో పీసీసీ అధ్యక్ష పదవిని ఎవరికి ఇవ్వాలనే అంశంపై సుదీర్ఘ చర్చ జరిగినట్టు తెలిసింది. మంత్రివర్గ విస్తరణ, పీసీసీ కొత్త అధ్యక్షుడి ఎంపికపై అధిష్ఠానం దృష్టి సారించడంతో ఆశావాహులు ప్రయత్నాలను ముమ్మరం చేశారు. పీసీసీ అధ్యక్ష పదవిని ఆశిస్తున్న మహేశ్‌కుమార్‌గౌడ్, మధుయాష్కీగౌడ్ గురువారం కాంగ్రెస్ అగ్రనేత సోనియాగాంధీతో భేటీ కావడం ప్రాధాన్యం సంతరించుకున్నది. మరోవైపు తమవారికి మంత్రి పదవులు ఇప్పించుకునేందుకు పలువురు మంత్రులు కూడా ప్రయత్నాలు చేస్తున్నట్టు తెలిసింది.

రుణమాఫీకి ఎన్సీడీసీ రుణం!

హైదరాబాద్, జూన్ 27(నమస్తే తెలంగాణ): రైతు రుణమాఫీకి అవసరమైన నిధులను సమకూర్చుకునేందుకు ప్రభుత్వం ప్రయత్నాలు మొదలుపెట్టింది. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వ అధికారులు జాతీయ బ్యాంకులతో రుణాల గురించి చర్చలు జరిపినట్టు విశ్వసనీయంగా తెలిసింది.భారీ మొత్తంలో రుణం ఇచ్చేందుకు జాతీయ బ్యాంకులు ఆసక్తి చూపడంలేదని సమాచారం. దీంతో రాష్ట్ర ప్రభుత్వ అధికారులు కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ నేషనల్ కోఆపరేటివ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఎన్సీడీసీ)ని సంప్రదించినట్టు తెలిసింది. రుణం ఇచ్చేందుకు తమ సంస్థ షరతులు, కేంద్ర ప్రభుత్వ అనుమతులను ఎన్సీడీసీ అధికారులు వివరించినట్టు తెలిసింది. ఎన్సీడీసీ కేంద్ర సహకార శాఖ అధీనంలో ఉంటుంది. ఈ సంస్థ రుణం ఇవ్వాలంటే కేంద్ర సహకార శాఖ అనుమతి తప్పనిసరి. ప్రస్తుతం కేంద్ర సహకార శాఖ మంత్రిగా బీజేపీ అగ్రనేత అమిత్‌షా వ్యవహరిస్తున్నారు. దీంతో ఎన్సీడీసీ రుణం కోసం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కేంద్ర పెద్దలను ప్రసన్నం చేసుకునే పనిలో పడినట్టు తెలిసింది. నాలుగు రోజులపాటు ఢిల్లీలో మకాం వేసిన రేవంత్‌రెడ్డి.. పార్టీ, ప్రభుత్వ వ్యవహారాలతోపాటు రుణమాఫీకి అవసరమైన రుణం పొందేందుకు కూడా తీవ్ర ప్రయత్నాలు చేసినట్టు తెలిసింది. ఇదే అంశంపై రాష్ట్ర ప్రభుత్వానికి సహకరించాలని పలువురు కేంద్ర మంత్రులకు ప్రత్యేకంగా విజ్ఞప్తి చేసినట్టు సమాచారం.

ప్రభుత్వానికి ఒయాసిస్‌లా ఎన్సీడీసీ

రుణమాఫీకి నిధుల వేటలో భాగంగా ముంబై వెళ్లిన అధికారులు ఆర్బీఐ అధికారులతో చర్చించినట్టు తెలిసింది. ఢిల్లీలో పలు జాతీయ బ్యాంకుల అధికారులతోనూ చర్చించినట్టు సమాచారం. అయితే ఆ బ్యాంకుల నుంచి ఆశించిన స్థాయిలో స్పందన రాలేదని తెలిసింది. ఇలాంటి పరిస్థితుల్లో ఎడారిలో ఒయాసిస్ మాదిరిగా ప్రభుత్వానికి ఎన్సీడీసీ కనిపించింది. రాష్ట్ర ప్రభుత్వ అధికారులు ఢిల్లీలో ఎన్సీడీసీ ఉన్నతాధికారులతో సంప్రదింపులు జరిపి, రాష్ట్ర ప్రభుత్వ అవసరాలను, రుణ అనివార్యతను వారికి వివరించినట్టు తెలిసింది. ఎక్కువ మొత్తంలో రుణం ఇవ్వాలని ఎన్సీడీసీని కోరినట్టు తెలిసింది. ఈ రుణం వస్తుందనే ఆశతోనే ప్రభుత్వ పెద్దలు రుణమాఫీపై ప్రకటనలు చేస్తున్నట్టు తెలిసింది.

జియో చార్జీలకు రెక్కలు

27 శాతం వరకు పెంచిన సంస్థ • జూలై 3 నుంచి అమల్లోకి కొత్త టారిఫ్‌లు

న్యూఢిల్లీ, జూన్ 27: దేశీయ టెలికం దిగ్గజ సంస్థ రిలయన్స్ జియో మొబైల్ వినియోగదారులకు షాకిచ్చింది. వచ్చే నెల 3 నుంచి అన్ని రకాల ప్లాన్ల టారిఫ్ ధరలను 12 శాతం నుంచి 27 శాతం వరకు పెంచుతున్నట్లు గురువారం ప్రకటించింది. రెండున్నరేండ్ల తర్వాత చార్జీలను పెంచడం ఇదే తొలిసారి కావడం విశేషం. సంస్థ తీసుకున్న తాజా నిర్ణయంతో 1 జీబీ డాటా ప్యాక్ ధర 27 శాతం పెంచడంతో రూ.15 నుంచి రూ.19కి చేరుకున్నది. ఈ సందర్భంగా రిలయన్స్ జియో ఇన్ఫోకామ్ చైర్మన్ ఆకాశ్ అంబానీ మాట్లాడుతూ..5జీ, కృత్రిమ మేధస్సు సాంకేతిక రంగంలో భారీగా పెట్టుబడులతో టెలికం రంగంలో నూతన ఆవిష్కరణలు సాధ్యమయ్యాయని, దీంతో స్థిరమైన వృద్ధిని సాధించడానికి కొత్త ప్లాన్లను అందుబాటులోకి తీసుకొచ్చినట్లు చెప్పారు. అలాగే 75 జీబీ పోస్ట్‌పెయిడ్ డాటా ప్లాన్ చార్జీ రూ.399 నుంచి రూ.449కి పెరగనున్నది. అత్యంత ప్రజాదరణ పొందిన 84 రోజుల కాలపరిమితితో అందిస్తున్న రూ.666 ప్లాన్ చార్జీని 20 శాతం సవరించడంతో ఇక నుంచి రూ.799కి చేరుకోనున్నది. వార్షిక రీచార్జి ప్లాన్లను సైతం 20-21 శాతం సవరించడంతో రూ.2,999 నుంచి రూ. 3,599కి చేరాయి. గతంలో ఇవి రూ. 1,559 నుంచి రూ. 1,899 మధ్యలో ఉండేవి. వీటితోపాటు రోజుకు 2 జీబీ డాటా, అంతకంతే అధిక ప్లాన్లు కూడా సంస్థ అందిస్తున్నది.

ఇతర సంస్థలు కూడా..

జియో బాటలోనే ఇతర టెలికం సంస్థలైన భారతీ ఎయిర్‌టెల్, వొడాఫోన్ ఐడియాలు సైతం టారిఫ్‌లను పెంచడానికి సమయాత్తమవుతున్నాయి. ఆదాయం పెంచుకోవడంలో భాగంగా వినియోగదారుల సగటు ఆదాయం(ఏఆర్‌పీయూ) పెంచడానికి సిద్ధమవుతున్నాయి. డిసెంబర్ 2021లో టెలికం చార్జీలను 40 శాతం వరకు పెంచిన సంస్థలు మళ్లీ మూడేండ్ల తర్వాత సవరించాయి. ప్రస్తుతం ఒక్కో కస్టమర్ నుంచి రూ.200 ఆదాయం వస్తుండగా, దీనిని రూ.300కి పెంచుకోవాలనుకుంటున్నది ఎయిర్‌టెల్.

పాత ప్లాన్ (రూ.లో)	డాటా	కాలపరిమితి (రోజులు)	కొత్త ప్లాన్ (రూ.లో)
155	2GB	28	189
209	1 GB/day	28	249
239	1.5 GB/day	28	299
299	2 GB/day	28	349
349	2.5 GB/day	28	399
399	3 GB/day	28	449
479	1.5 GB/day	56	579
533	2 GB/day	56	629
395	6 GB	84	479
666	1.5 GB/day	84	799
719	2 GB/day	84	859
999	3 GB/day	84	1199
1559	24 GB	336	1899
2999	2.5 GB/day	365	3599

మదుపరుల్లో క్వాంట్ అలజడి

3 రోజుల్లో రూ.1,400 కోట్ల పెట్టుబడులు ఉపసంహరణ

ఫ్రంట్-రన్నింగ్ కేసులో సెబీ దర్యాప్తు దెబ్బ

ముంబై, జూన్ 27: క్వాంట్ మ్యూచువల్ ఫండ్‌లో పెట్టుబడులు పెట్టిన మదుపరులు తీవ్ర ఒత్తిడికి లోనవుతున్నారు. సదరు ఫండ్‌పై మార్కెట్ రెగ్యులేటర్ సెబీ.. ఫ్రంట్-రన్నింగ్ కేసు దర్యాప్తు చేస్తుండటమే కారణం. ఈ నేపథ్యంలోనే 3 రోజుల్లో దాదాపు రూ.1,400 కోట్ల పెట్టుబడులను ఇన్వెస్టర్లు వెనక్కి తీసుకున్నారు. క్వాంట్ మ్యూచువల్ ఫండ్ స్కీముల్లో ఇంకా పెట్టుబడులు లేదా సిప్ (సిస్టమ్యాటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్)లతో ముందుకెళ్తే నష్టపోతామేమోనన్న భయాలు ఇప్పుడు మెజారిటీ మదుపరులను వెంటాడుతున్నాయి.

ఎన్ఏవీ డౌన్

ఫ్రంట్-రన్నింగ్ కేసు నేపథ్యంలో క్వాంట్ మ్యూచువల్ ఫండ్ స్కీముల నికర ఆస్తుల విలువ (ఎన్ఏవీ) తరిగిపోతున్నది. బుధవారం ఒక్కరోజే 0.25 శాతం మేర క్షీణించింది. క్వాంట్ హెల్త్‌కేర్ ఫండ్ ఎన్ఏవీ 0.25 శాతం, స్మాల్ క్యాప్ ఫండ్ 0.52 శాతం, మిడ్ క్యాప్ ఫండ్ 0.17 శాతం చొప్పున పడిపోయాయి. అయినప్పటికీ వివిధ కాలవ్యవధుల్లో ఈక్విటీ కేటగిరీల వ్యాప్తంగా ఇంకా క్వాంట్ మ్యూచువల్ ఫండే అగ్రస్థానంలో ఉన్నది. గత ఐదేండ్లలో సంస్థ స్మాల్ క్యాప్ ఫండ్ దాదాపు 495 శాతం రాబడులను మదుపరులకు అందించింది. క్వాంట్ మిడ్ క్యాప్ ఫండ్ కూడా 348.65 శాతం రిటర్న్స్‌ను ఇచ్చినట్టు కనిపిస్తున్నది.

ఏం జరుగుతోంది?

ముంబైలోని క్వాంట్ ప్రధాన కార్యాలయంతోపాటు హైదరాబాద్‌లోగల ఈ వ్యవహారంతో లబ్ధి పొందిన అనుమానితులకు చెందిన చోట్లలో సెబీ సోదాలు నిర్వహించింది. అక్రమ లాభాలను ఆర్జించడానికి సంస్థ నుంచి విశ్వసనీయ సమాచారాన్ని లీక్ చేసిన వారి మొబైల్స్, కంప్యూటర్లు, ఇతరత్రా డిజిటల్ డివైజ్‌లను సీజ్ చేసింది. క్వాంట్ డీలర్లలో ఒకరు లేదా జరుగబోయే లావాదేవీకి సంబంధించి క్వాంట్ కుదుర్చుకున్న బ్రోకరేజీ సంస్థల్లో ఏదైనా ఈ అక్రమాలకు పాల్పడి ఉండవచ్చని అనుమానిస్తున్నారు.

నిపుణులేమంటున్నారు?

క్వాంట్ మ్యూచువ్ ఫండ్ స్కీముల్లో ఇప్పుడున్న పెట్టుబడులను వెంటనే వెనక్కి తీసుకోవాల్సిన అవసరం ఏమీ లేదని మార్కెట్ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. అయితే కొత్త పెట్టుబడులకు మదుపరులు దూరంగా ఉంటే మంచిదేనన్నారు. సెబీ కూడా ఇంకా ఈ కేసులో ఏమీ తేల్చలేదని ఫైనాన్షియల్ రేడియన్స్ వ్యవస్థాపకుడు రాజేశ్ మినోచా గుర్తు చేస్తున్నారు. నిజానికి క్వాంట్ ఇన్వెస్టింగ్ పద్ధతి చాలా భిన్నంగా ఉందన్న ఆయన.. అయినప్పటికీ పరిమాణాత్మక పెట్టుబడి పద్ధతినే అనుసరిస్తున్నారని, కాబట్టి భవిష్యత్తులో మదుపరులు ఈ ఫండ్ నుంచి మారినా పెద్దగా ప్రతికూల ప్రభావమేమీ ఉండబోదన్నారు.

నగదు నిల్వలు రూ.9వేల కోట్లపైనే

క్వాంట్ మ్యూచువల్ ఫండ్‌లో ఈ ఏడాది మే నెల నాటికి దాదాపు రూ.9,355 కోట్ల నగదు నిల్వలున్నాయి. కంపెనీ నిర్వహణలోని మొత్తం ఈక్విటీ ఆస్తులు ఈ నెల 26 నాటికి రూ.88,270 కోట్లుగా ఉన్నాయి. ఇక ఈ ఫండ్‌లో సుమారు 21 ఈక్విటీ మ్యూచువల్ ఫండ్ స్కీములున్నాయి. ఇందులో 4 స్కీముల పోర్ట్‌ఫోలియోల్లో రూ.1,000 కోట్ల కుపైగానే నగదు నిల్వలున్నాయి. క్వాంట్ స్మాల్ క్యాప్ ఫండ్‌లో అత్యధికంగా రూ.1,607.37 కోట్లున్నాయి. దీని నిర్వహణలోని మొత్తం ఈక్విటీ ఆస్తులు గత నెలాఖరు కల్లా రూ.19,635 కోట్లు. మిగతా 3 స్కీములు.. క్వాంట్ ఫ్లెక్సీ క్యాప్ ఫండ్, యాక్టివ్ ఫండ్, మిడ్ క్యాప్ ఫండ్.

ఫ్రంట్-రన్నింగ్ కేసు అంటే?

ఓ కంపెనీలో జరుగబోతున్న భారీ లావాదేవీకి సంబంధించి తనకున్న విశ్వసనీయ సమాచారంతో ఓ బ్రోకర్ ముందుగానే సదరు కంపెనీలో వ్యక్తిగతంగా షేర్ల కొనుగోళ్ల ద్వారా పెట్టుబడులకు దిగడాన్నే ఫ్రంట్-రన్నింగ్ అంటారు. ఉదాహరణకు.. ఓ భారీ పెట్టుబడిదారు ఓ కంపెనీలో పెద్ద ఎత్తున షేర్లను కొనబోతున్నారు. ఈ విషయం ముందుగానే ఓ బ్రోకర్‌కు తెలిసింది. వ్యక్తిగత లాభాపేక్షతో ఆ బ్రోకర్ సదరు లావాదేవీ కంటే ముందుగానే ఆ కంపెనీకి చెందిన కొన్ని షేర్లను తన ఖాతాలో కొని పెట్టుకుంటే దాన్ని ఫ్రంట్-రన్నింగ్ కేసుగా పరిగణిస్తారు. ఈ వ్యవహారం అంతా కూడా సెబీ నిబంధనలకు విరుద్ధం. అందుకే ఇవి బయటపడినప్పుడు సెబీ దర్యాప్తులకు దిగుతుంది. గతంలో యాక్సిస్, హెచ్‌డీఎఫ్‌సీ మ్యూచువల్ ఫండ్లలోనూ ఈ కేసులు నమోదయ్యాయి.

కంపెన